క్లుప్తంగా

'కొమరగిరి'కి ఘనసత్కారం



మక్కపేట(వత్సవాయి) : జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ పాలకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, సవిత దంపతులను పలువురు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం స్థానిక శ్రీసాయి సెంచరీ హైస్కూల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భరద్వాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా నియమించినందుకు పేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు. దేవాలయ విశిష్టతను పెంచేలా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు తనవంతు కృషిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువస్తానని తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



నందిగామ: తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలను గుర్తించడంతోపాటు ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించినట్లు ఆర్డీవో ఎం.పద్మావతి తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నందిగామ రవాణా శాఖ కార్యాలయ పరిధిలోని జాతీయ, రాష్ట్ర రహదారులను మంగళవారం ఆమె పరిశీలించారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంవీఐ రాజు, పోలీస్, రాష్ట్ర, జాతీయ రహదారుల సిబ్బంది పాల్గొన్నారు.

భూసారంపై రైతులకు అవగాహన



పోచంపల్లి(జగ్గయ్యపేట): రైతులు విధిగా తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే)శాస్త్రవేత్త శివప్రసాద్ సూచించారు. గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శివప్రసాద్ మాట్లాడుతూ భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలపై రైతుకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో సాగవుతున్న పసుపు పంటను పరిశీలించారు. కార్యక్రమంలో బాలమురళీధర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విజయ ప్రకాష్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్రంగా కులగణన సర్వే



కునికెనపాడు(కంచికచర్ల) : మండలంలోని కునికెనపాడు గ్రామసచివాలయంతోపాటు ఇతర గ్రామాల్లో కూడా సచివాలయ సిబ్బంది మంగళవారం కులగణన సర్వే చేపట్టారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల వివరాలతోపాటు వారి కులం వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. కునికెనపాడులో మొత్తం కుటుంబాలు 723ఉన్నాయని, 532 కుటుంబాలకు సంబంధించిన కులగణన సర్వే పూర్తయిందని పంచాయతీ కార్యదర్శి స్వామిరాజు తెలిపారు.

అర్హులకు ఇంటి ముంగిటకే పథకాలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గండేపల్లి(కంచికచర్ల): అర్హులైన ప్రతిఒక్కరికీ సచివాలయాల ద్వారా ఆయా సంక్షేమ పథకాలను వారి ఇంటి ముంగిటనే అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు కొనియాడారు. మండలంలోని గండేపల్లిలో మంగళవారం ఆయన 'గడపగడపకు మనప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతోపాటు వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరును ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఇటువంటి ముఖ్యమంత్రి తిరిగి మళ్లీ అధికారంలోకి రావాలంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి బొక్కా రవి కుమార్, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి, సొసైటీఅధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచి బెల్లంకొండ సుబ్బారావు, నాయకులు సుంకు బాలాజీ, నెలకుదిటి శివనాగేశ్వరరావు, కృష్ణా రంగారావు, సంగం దేవరాజు, తలమాల కిషోర్, వేల్పుల రమేష్, వేమవరపు పురుషోత్తం మార్త శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, వీఆర్వో వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేరకలపాడు అభివృద్ధికి రూ.20లక్షలు

పేరకలపాడు(కంచికచర్ల) : గ్రామాల్లో మౌలికవసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన నిధులు కేటాయిస్తున్నారని, ఆ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సూచించారు. మండలంలోని పేరకలపాడులో ప్రజాప్రతినిధులు, అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని పేరకలపాడులో నిర్వహించిన సందర్భంగా గ్రామస్తులు తనదృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీరోడ్లు అభివృద్ధికి రూ.8.5లక్షలు, ఎస్సీ కాలనీలో డ్రైనేజీ కోసం రూ.5లక్షలు, ఎస్సీ, బీసీ ఏరియాలో కల్వర్టుల నిర్మాణానికి 6.5లక్షలు కలిపి మొత్తం రూ.20లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆయా పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు వేమవరపు పురుషోత్తం, నాయకులు మర్రి వరప్రసాద్, కందుల అశోక్, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వో, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గండేపల్లిలో సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు



లింగాలపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

లింగాలపాడులో..

నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని లింగాలపాడులో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా తనదృష్టికి వచ్చిన సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మాట్లాడుతూ లింగాలపాడులోని సమస్యల పరిష్కారం కోసం గ్రామసచివాలయం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిరూ.20లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో ప్రతీ సమస్యను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు బొల్లినేని శ్రీనివాసరావు, పారుపల్లి హరిబాబు, సూరా కృష్ణ, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాల సమస్యకు త్వరలోనే పరిష్కారం

విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని చిరునగర్, దుర్గాపురం, సత్యనారాయణపురం, విలియంపేట, వైవై కాలనీ, ఎన్జీవో కాలనీ ప్రాంతాల్లో గృహాలు ఉండి ఇళ్లపట్టాలు లేనివారికి త్వరలోనే ఇళ్లపట్టాలు అందిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను హామీ ఇచ్చారు. ఇళ్లపట్టాలు, భూసమస్యల పరిష్కారంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నందిగామ ఆర్డీవో పి.సాయిబాబు అధ్యక్షతన పలువురు అధికారులతో ఎమ్మెల్యే ఉదయభాను మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ పట్టణంలోని చిరునగర్, దుర్గాపురం, సత్యనారాయణపురం, విలియంపేట, వైవై కాలనీ, ఎన్జీవో కాలనీ తదితర ప్రాంతాల్లో ఎంతోమంది ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నప్పటికీ ఆయా గృహాలకు పట్టాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి నెల రోజుల్లో అర్హులందరికీ పట్టాలను అందించడంతోపాటు ఆయా భూసమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పేట తహసీల్దార్ మన్నె సూర్యారావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, డీటీ నాగరాజు, ఆర్ఐ ఆనంద్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, కౌన్సిలర్ వట్టెం మనోహర్, న్యాయవాది సామినేని రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవాల భవానీ ప్రసాద్, చెరుకుమల్లి రాంబాబు, లగడపాటి నాగేశ్వరరావు, టౌన్ సర్వేయర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఇళ్లపట్టాల సమస్యపై ఆర్డీవో పి.సాయిబాబుతో చర్చిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

రూ.25లక్షలతో స్మశానవాటిక అభివృద్ధి...

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక 25వ వార్డు క్రిస్టియన్‌పేట సమీపంలోని ఎస్సీ స్మశానవాటిక అభివృద్ధికి ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.25లక్షలతో చేపట్టిన పనులకు జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ పేటతోపాటు నియోజకవర్గంలోని ఆయా స్మశానవాటికల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. క్రిస్టియన్‌పేట ఎస్సీల స్మశానవాటిక చుట్టూ కాంపౌండ్ వాల్, స్థలం చదునుచేయడం, బోరు, గేట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ పనులను 15రోజుల్లో పూర్తిచేయాలని కంట్రాక్టర్లను ఆదేశించారు. ఇటీవల పట్టణంలో వడ్డెర, పద్మశాలి, పట్కారీల స్మశాన వాటికల కోసం స్థలాలు కేటాయించి వాటి అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు పాకలపాటి సుందరమ్మ, గింజుపల్లి వెంకట్రావు, వట్టెం మనోహర్, మోరె బాబీ, కర్ల శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఫిరోజ్‌ఖాన్, ఎస్టీ, కార్మిక విభాగాల అధ్యక్షులు బద్దునాయక్, గోగుల వెంకయ్య, నాయకులు ముత్యాల శేషు, గెంటేల రాము, ఏఈ హనుమంతరావు పాల్గొన్నారు.



స్మశానవాటిక అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉదయభాను, నాయకులు

నేతాజీ దేశభక్తి అందరికీ ఆదర్శం



నందిగామలో నేతాజీకి నివాళులర్పిస్తున్న దీక్ష కళాశాల విద్యార్థులు, ఏఐవైఎఫ్ నాయకులు



పేట వీఎస్‌పీ టౌన్‌షిప్‌లో సుభాస్‌చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

నందిగామ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక రథం బజార్ సెంటర్‌లో నేతాజీ సేవాదళ్ ఆధ్వర్యంలో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. నేతాజీ గొప్పతనానికి వారికి వివరించారు. నేతాజీనగర్‌లోని ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని దీక్ష కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండారు కేదార్నాథ్ శర్మ, సీతారామయ్య, పూజారి రాజేష్, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని పెద్దాపురం ఏహెచ్‌యూపీ పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, సర్పంచి నిప్పులపల్లి శాంతమ్మ, ఉపసర్పంచి బవిరిశెట్టి లక్ష్మి తదితరులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీపీ కోటేరు లక్ష్మి మాట్లాడుతూ యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ 127వ జయంతిని పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలు, విద్యా సంస్థలలో నేతాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను, స్వాతంత్రోద్యమంలో ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు.

వీఎస్‌పీ టౌన్‌షిప్‌లో...

పట్టణ శివారు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సుభాస్ చంద్రబోస్ పార్కులో నేతాజీ పార్కు కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైన్స్ ఇన్‌చార్జి బీయూవీఎస్ రాజు తదితరులు సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నేతాజీ ఉద్యమస్ఫూర్తిని, దేశభక్తిని కొనియాడారు. కార్యక్రమంలో నేతాజీ పార్కు కమిటీ అధ్యక్షుడు మన్నె శ్రీనివాసరావు, మైన్స్ అధికారులు కిరణ్‌కుమార్ సింగ్, కేవీటీ చంద్రశేఖర్, జీవీ ప్రసాద్, బి.విశ్వాసరావు, ప్రసాద్‌బాబు, రామచంద్రనాయక్, జూలియస్, వర్మ, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు



అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బూచవరం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి స్రవంతి సూచించారు. గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 200మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయడమేకాకుండా మెరుగైన శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించిన వారిని ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు రిఫర్ చేస్తున్నట్లు చెప్పారు. వైద్యాధికారి నాగరాణి, సర్పంచి పానుగంటి త్రివేణి, సూపర్‌వైజర్లు వెంకట్రావ్, నాగలక్ష్మి, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గుణదల లూర్దుమాత వేడుకలు



పెనమలూరు: గుణదల లూర్దుమాత వంద వసంతాల వేడుకలు కానూరు మౌంట్‌కార్మెల్ పుణ్యక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుణదల పుణ్యక్షేత్రం నుంచి వచ్చిన గుణదల లూర్దుమాత స్వరూపాన్ని ఫాదర్ చలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో భక్తుల దీవెనల కోసం ప్రదర్శించారు. గంగూరు, పోరంకి, కామయ్యతోపు, కానూరు నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి లూర్దుమాతను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఫాదర్లు ప్రదీప్, దేవదానం, ఉపదేశకులు పాల్గొని దివ్యబలి పూజ నిర్వహించారు.

డొంకరోడ్డు పనులకు శంకుస్థాపన

చందర్లపాడు(నందిగామ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.ఐదు లక్షలతో చేపడుతున్న డొంకరోడ్డు ఏర్పాటు పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు, రోడ్లు, తదితర వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో కనీస వసతులు లేక ప్రజలు నానాఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి నందిగామ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో గ్రామాల్లో మౌలికవసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, నల్లాని సాయి, రాయల జానకిరామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



ముప్పాళ్లలో డొంకరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

పెద్దాపురం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎంపీపీ కోటేరు లక్ష్మి కొనియాడారు. మండలంలోని పెద్దాపురం ఏహెచ్‌యుపి పాఠశాలలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను మంగళవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కోటేరు లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారాయన్నారు. ముఖ్యంగా చరిత్రలోనే మొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి నిప్పులపల్లి శాంతమ్మ, ఉపసర్పంచి బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, పాఠశాల హెచ్ఎం వెంకట్రావ్, నాయకులు పాల్గొన్నారు.



ట్యాబులు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఉపాధ్యాయులు

జగ్గయ్యపేటలో మహిళా ఓటర్లే అధికం

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా 2,02,407 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ సూర్యారావు మంగళవారం తెలిపారు. మొత్తం ఓటర్లలో పురుషులు 97,229మంది, మహిళలు 1,05,126 మంది, ఇతరులు 12మంది ఉన్నట్లు వివరించారు. నియోజకవర్గ స్థాయిలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 7897మంది అధికంగా ఉన్నారు. జగ్గయ్యపేట మండలంలో మొత్తం 53,450మంది ఓటర్లు ఉండగా పురుషులు 25,812మంది, మహిళలు 27,634మంది, ఇతరులు నలుగురు ఉన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో 42,952మంది ఓటర్లు ఉండగా పురుషులు 20,189 మంది, మహిళలు 22,757మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. వత్సవాయి మండలంలో 49,310మంది ఓటర్లు ఉండగా పురుషులు 23,770మంది, మహిళలు 25,540 మంది, పెనుగంచిప్రోలు మండలంలో 41,391మంది ఓటర్లకుగాను పురుషులు 20,032మంది, మహిళలు 21,357మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాల్లో 15,304 మంది ఓటర్లు ఉండగా పురుషులు 7,426మంది, మహిళలు 7,878మంది ఓటర్లు ఉన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఆయా మండలాలవారీగా కూడా పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికం. నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తహసీల్దార్ వివరించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కానూరి శిల్ప మంగళవారం తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు హాజరవుతారన్నారు. ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

26 నుంచి ప్రజలకు అందుబాటులోకి సిమ్మింగ్‌పూల్

జగ్గయ్యపేట అర్బన్: గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ ఇండోర్ స్టేడియం వద్ద అసంపూర్తిగా అరకొర సౌకర్యాలతో ప్రారంభించిన మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌ను ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. స్విమ్మింగ్ పూల్ ట్రయల్‌రన్‌ను మంగళవారం నిర్వహించగా, చైర్మన్ రాఘవేంద్ర స్వయంగా స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టి ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఈనెల 26వతేదీ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సిమ్మింగ్‌పూల్‌ను పట్టణ ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. సిమ్మింగ్‌పూల్ నిర్మాణ పనుల్లో గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా టెక్నికల్ సమస్యలు తలెత్తి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ఎస్ఏపీ ఇంజినీర్ల సహాయం తీసుకొని పూర్తిస్థాయిలో కొత్త హంగులతో సిమ్మింగ్‌పూల్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సిమ్మింగ్ పూల్ ట్రైల్‌రన్‌లో తాను పాల్గొని చక్కటి అనుభూతిని పొందినట్లు తెలిపారు. ఈ26 నుంచి విద్యార్థులు, చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. స్విమ్మింగ్ కోచ్ పాండురంగారావు పర్యవేక్షణలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రావు, కొలగాని రాము, నాయకులు కాశికిషోర్, దువ్వల రామకృష్ణ, తన్నీరు నాగేంద్ర, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సిమ్మింగ్‌పూల్ ట్రయల్‌రన్‌లో పాల్గొన్న చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు

11న శతాధిక కవి సమ్మేళనం

విజయవాడ కల్చరల్: జాతికి స్ఫూర్తినింపిన మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ సాక్షిగా ఫిబ్రవరి 11వ తేదీ ఆదివారం మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కలిమిశ్రీ అన్నారు. స్వరాజ్య మైదానంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని 83329 03156 నంబరులో సంప్రదించాలని కోరారు. రాఘవేంద్రశేఖర్, సంస్థ సభ్యుడు కుర్రా సురేష్ పాల్గొన్నారు.